క్లుప్తంగా

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వివాహ శుభ పత్రికను అందజేస్తున్న ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు

నిడదవోలు : తాడేపల్లిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన ఇంటి వద్ద గురువారం నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు, సుమలత దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో గచ్చిబౌలి అన్వయ కన్వెన్షన్‌లో ఈనెల 24న నిర్వహించనున్న ఎమ్మెల్యే కుమార్తె డాక్టర్ సామశ్రీ వివాహానికి సంబంధించిన ఆహ్వాన శుభ పత్రికను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ భారతిరెడ్డి దంపతులకు అందజేశారు. వారి వెంట ఎమ్మెల్యే కుమారుడు జి. వరుణ్‌సాయి ఉన్నారు.

భక్తాంజనేయునికి పూజలు

పెరవలి: నల్లాకులవారిపాలెంలో భక్తాంజనేయస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో వచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. తులాభారం ద్వారా ఆదివారం 850 కిలోల పటికబెల్లం స్వామివారికి వచ్చిందని కమిటీ నిర్వాహకులు తెలిపారు. తెల్లవారుజామున స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. మహిళలు హనుమాన్ చాలీసాను పఠించారు.

నేడు కోడిగూడెంలో 'గడపగడపకు'

దేవరపల్లి: ద్వారకాతిరుమల మండలం కోడిగూడెంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు ప్రతాపనేని వాసు తెలిపారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొనాలని కోరారు

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గోపాలపురం: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందినట్లు ఎస్సై కె రామకృష్ణ గురువారం విలేకరులకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గోపాలపురం మండలం గంగోలు పంచాయతీ పరిధిలోని యర్రవరం గ్రామానికి చెందిన చేబ్రోలు రాజేష్ దుర్గాప్రసాద్(16) బుధవారం పొలంలో పురుగుమందు తాగాడు. అపస్మారక స్థితికి చేరిన దుర్గాప్రసాద్‌ను కుటుంబ సభ్యులు రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి అక్కడి నుంచి కాకినాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్సై చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పెరవలి: మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్టు పెరవలి ఎంపీడీఓ రమేష్ తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అధ్యక్షత వహిస్తారని తెలిపారు. అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

పంటకోత ప్రయోగం

తాళ్లపూడి: మండలంలోని నల్లమిల్లిపాడులో గురువారం పొగాకు పంటలో పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఏఎస్‌ఓ వెంకటరమణ, వ్యవసాయ సహాయకురాలు మహేశ్వరి తదితరులు గ్రామంలో సర్వే నంబర్ 4, 5/1బీలో వేసిన వర్జీనియా పొగాకు పంట కోత ప్రయోగం నిర్వహించారు. పొగాకు పంట ఆశాజనకంగా ఉందని, రైతులు ధర పెంచాలని కోరారు. రైతులు చెరుకూరి నాగేంద్ర, కిశింశెట్టి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన సదస్సు

దేవరపల్లి: భారత రాజ్యాంగంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని దేవరపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత సూచించారు. భారత రాజ్యాంగం-విద్యార్థులకు అవగాహన అనే అంశంపై గురువారం గౌరీపట్నంలో సదస్సు నిర్వహించారు. సదస్సులో జెడ్పీటీసీ స్వర్ణలత ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జోతిరావ్ పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ రాయి అన్నపూర్ణ, వైస్ ఎంపీపీ కొర్లపాటి అరుణ, సొసైటీ అధ్యక్షుడు గుత్తికొండ అచ్యుతరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కుండా వెంకటేశ్వరరావు, టి.సోమరాజు, కొటారు వెంకటసుబ్బారావు, ఆండ్రు శ్రీహరి, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఎం. పైడియ్య పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

గోపాలపురం: గోపాలపురం మండలం కరిచర్లగూడెంలో పిచ్చికుక్క గురువారం స్వైరవిహారం చేయడంతో నలుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి. పిచ్చికుక్క దాడిలో గాయపడిన కరిచర్లగూడెంకు చెందిన బోగిశెట్టి ఏసురత్నం, కోలా సత్యవతి, పఠాన్ సత్తార్, మీసాల సత్యనారాయణ స్థానిక ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు.

సీఎం జగనన్న పాలనలో అన్ని వర్గాలకు మేలు



కొవ్వూరులో 14వ వార్డులో ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న హోం మంత్రి తానేటి వనిత

- హోం మంత్రి తానేటి వనిత
- 14వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

కొవ్వూరు: సుపరిపాలన అందిస్తూ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత కోరారు. పట్టణంలో 14వ వార్డులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా హోం మంత్రి ఇంటింటికీ వెళ్లి వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరితో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని గణాంకాలతో సహా లబ్ధిదారులకు వివరించారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అందాలన్నా, పేదలకు మరింత మేలు చేకూరాలన్నా వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలంతా అండగా ఉండాలని కోరారు. ప్రజల సమస్యలను సావధానంగా వింటూ వాటి పరిష్కార మార్గాలు చూపుతూ ముందుకు సాగారు. కొన్ని సమస్యలను నమోదు చేసుకుని త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, స్థానిక వార్డు కౌన్సిలర్ చీరా అరుణకుమారి, మాజీ కౌన్సిలర్ చీరా వెంకటరమణ, మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, మునిసిపల్ వైస్ చైర్ పర్సన్ గండ్రోతు అంజనీదేవి,పట్టణ పార్టీ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు,గౌరవ అధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, రామా సొసైటీ అధ్యక్షుడు దేవగుప్తాపు లక్ష్మణరావు, వరిగేటి సుధాకర్, పతివాడ రామారావు, కౌన్సిలర్ తోట లక్ష్మి ప్రసన్న, అంకోలు వెంకట లిల్లీ పద్మలీల, వరిగేటి లలితకుమారి తదితరుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంటలకు మేలు చేసే పురుగులను సంరక్షించాలి



పోతవరంలో వరి పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి కమల్‌రాజ్

నల్లజర్ల: రైతులు ఇటీవల అధిక దిగుబడుల కోసం మోతాదుకు మించి పురుగు మందులు, ఎరువులు వినియోగిస్తున్నారని దీంతో పంటకు మేలు చేసే పురుగులు చనిపోయి నష్టం వాటిల్లుతుందని మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ అన్నారు. పోతవరంలో బొల్లిన రామచంద్రం పొలంలో గురువారం నిర్వహించిన పొలంబడిలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు వరి క్షేత్రాలను పరిశీలించారు. ఎంటియూ-1121, యస్‌యల్-10 రకం వరిపై కాండం తొలుచుపురుగు ఆశించి దుబ్బులు చేయక పంట నిస్సారంగా ఉందని గుర్తించారు. నవంబరులో ఆకుమడి పోసి డిసెంబరులో నాట్లు వేసిన ప్రాంతాల్లో ఈలోపం గుర్తించామన్నారు. సస్యరక్షణలో జీవనియంత్రణ పద్ధతులు రైతులు అలవర్చుకోవాలన్నారు. పరాన్న జీవులు, బదనికలు, మిత్ర పురుగులు పంటలకు ఆశించే పలురకాల తెగుళ్లను అదుపులో ఉంచుతాయన్నారు.

కాండం తొలుచు పురుగు నివారణ

ఈ పురుగు వరి పంటను అధికంగా నష్ట పరుస్తుందన్నారు. పంట పిలక దశలో కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు 10 కిలోలు లేదా కార్టాఫ్ హైడ్రోక్లోరైడు 4జి ఎకరానికి 8 కిలోలు చల్లుకొని నివారించవచ్చునన్నారు. అంకురం ఏర్పడే దశలో క్లోరాంట్రానిపోల్ 20 యస్.సి 60 మి.గ్రా, లేదా కార్టాఫ్ హైడ్రోక్లోరైడు (50డబ్ల్యూపీ) 400 గ్రాములు 20 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. వ్యవసాయ సహాయకులు పామర్తి దుర్గాసురేష్, గ్రేస్, రైతులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన



తాళ్లపూడి మాంటిస్సోరీ హైస్కూల్లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై

తాళ్లపూడి: మైనర్ బాలికల పట్ల బాధ్యతతో మెలగాలని అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన శిక్షలు ఉంటాయని తాళ్లపూడి ఎస్సై కె వెంకటరమణ అన్నారు. వేగేశ్వరపురం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, తాళ్లపూడిలోని మాంటిస్సోరి హైస్కూల్లో విద్యార్థులకు పోక్సో, ఈవ్ టీచింగ్, మైనర్లపై దాడులు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులు బాలికల పట్ల సోదరభావంతో మెలగాలన్నారు. బాలికలు ఇతరుల నుంచి గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ను గుర్తించి ఉపాధ్యాయులకు లేదా తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. బాలికలపై దాడులు చేయడం నేరం అని వీటిపై కఠిన శిక్షలు అమలులో ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ వీవీ అనీష్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేడుకగా నరసన్న కల్యాణోత్సవాలు



సుందరగిరిపై పూజలందుకుంటున్న లక్ష్మీనరసింహస్వామి

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్.జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువైన లక్ష్మీనరసింహ స్వామి కల్యాణ మహోత్సవాలు నేత్రపర్వంగా నిర్వహిస్తున్నారు. గురువారం ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు, పండితులు నిత్యహోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి, అమ్మవార్లకు హారతి, మంత్ర పుష్పములు సమర్పించారు. సాయంత్రం మూలమంత్ర హవనములు, బలిహరణలు, హారతి, మంత్రపుష్పములు వంటి కార్యక్రమాలు నేత్రపర్వంగా నిర్వహించారు.

ప్రాణాచారాలు పడిన మహిళలు

సంతానం కోసం పరితపించే పలువురు మహిళలు ఉదయం ఆలయ ప్రాంగణంలో ఆకుంటిత దీక్షతో ప్రాణాచారాలు నిర్వహించారు. ముందుగా వారంతా నారసింహుడిని దర్శించారు. అనంతరం సుందరగిరిపై పాలపొంగళ్లను వండి స్వయంగా స్వామివారికి నైవేద్యంగా సమర్పించుకున్నారు. ఆ తరువాత తడి దుస్తులతో వారంతా ఆలయం వెనుక ప్రాణాచారం ఆచరించారు. సాయంత్రం వరకు ఆ మహిళలు నరసింహుని స్మరిస్తూ ఉపవాస దీక్షను చేశారు. ఇలా చేయడం వల్ల వారికి స్వామివారు కోర్కెలను తీరుస్తాడని భక్తుల నమ్మకం. అనంతరం వారు నవగ్రహ పూజలు చేశారు.

నేడు నారసింహుడి కల్యాణం

సుందరగిరి కొండ దిగువనున్న కల్యాణ మండపంలో నరసన్న కల్యాణ మహోత్సవం శుక్రవారం ఉదయం 11.10 గంటలకు వైభవంగా జరగనుంది. ఇందుకు దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు కోరారు.

సర్వసభ్య సమావేశానికి అధికారులందరూ హాజరుకావాలి



ఉండ్రాజవరం మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి

ఉండ్రాజవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి అధికారులు గైర్హాజరవడంపై ఎంపీడీఓ శ్రీనివాసు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని ఎంపీపీ ఆవేదన వ్యక్తం చేసారు. సమావేశంలో పాల్గొనటానికి వచ్చిన తనకు కనీస మర్యాద ఎందుకు ఇవ్వడం లేదంటూ అధికారుల తీరుపై ఆమె అసహనం వ్యక్తం చేసారు. ఈ సమావేశానికి పలువురు అధికారులు హాజరు కాగా ఆర్అండ్‌బీ ఏఈ సమావేశానికి రాకపోవడంతో అతని బదులు రికార్డ్ అసిస్టెంట్ హాజరుకావడంతో ఎంపీడీఓ శ్రీనివాసు అతనికి అనుమతించలేదు. ఉపాధిహామీ అవకతవకలు జరిగినట్లు గత సంవత్సరం ఆడిట్ నివేదిక ఇస్తే ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని మండల కోఆప్షన్ సభ్యుడు షాజహన్ ప్రశ్నించారు. పసలపూడి గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌కు సంవత్సర కాలం నుంచి పని చేస్తున్నట్లు, రికార్డులో ఉన్నా నేటికీ పోస్టింగ్ ఇవ్వలేదని ఆయన సభ దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు. దీనిపై ఎంపీడీఓ మాట్లాడుతూ మూడు రోజుల్లో దీనిపై నివేదిక అందజేస్తామన్నారు. సమావేశానికి హాజరైన అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డ్ అందుకున్న ఎంపీడీఓ ఏ.శ్రీనివాసును ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరామయ్య, వైస్ ఎంపీపీలు ఎన్.సరోజ, చెట్టే నవీన్, ఎంపీటీసీ సభ్యులు, ఈఓపీఆర్డీ ముత్యం వీరాస్వామి నాయుడు, పాల్గొన్నారు.

ఆసుపత్రికి కుర్చీల అందజేత

నిడదవోలు : నిడదవోలు సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఆయుర్వేద ప్రభుత్వ వైద్యశాలకు గురువారం బీపీ యంత్రం, ఆరు కుర్చీలు అందజేశారు. అనంతరం డాక్టర్ కొల్లిపర శ్రీవిద్యను సత్కరించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. సంఘ అధ్యక్షుడు అడపా సూర్యచంద్రరావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మాగాపు వెంకట రామలక్ష్మి, గొన్నాబక్తుల రామారావు, ముంగండ చిట్టిబాబు, కొత్లపల్లి నాగేశ్వరరావు, ఆరుగొళ్ల వెంకటేశ్వరరావు, దారపురెడ్డి సూర్యచంద్రరావు, గాజుల సత్యనారాయణ, షేక్ హుస్సేన్ షరీఫ్ పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే పథకాల లబ్ధి

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- కోడిగూడెంలో గడప గడపకు మన ప్రభుత్వం



ద్వారకాతిరుమల మండలం కోడిగూడెంలో లబ్ధిదారుడికి పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల: ప్రభుత్వ పథకాల లబ్ధి అర్హుల ఇళ్ల వద్దకే చేరుతోందని, అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని కోడిగూడెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తలారి ఇంటింటికీ వెళ్లి, ప్రజా సమస్యలపై ఆరా తీసి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరించారు. అర్హులెవరికైనా సాంకేతిక సమస్యల కారణంగా పథకాలు అందకుంటే వెంటనే గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి రెండు కళ్లని అన్నారు. వచ్చే ఎన్నికల్లో సంక్షేమ సారధికి మళ్లీ పట్టం కట్టాలని కోరారు. ప్రతిపక్షాలు చేసే కుట్రలు, కుతంత్రాలను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో వారికి తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, చెలికాని బుల్లియ్య, పోల్కంపల్లి అనీల్‌బాబు, చెలికాని సంజయ్, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, బొండాడ వెంకన్నబాబు, సర్పంచ్ మానుకొండ ప్రసాద్, తాండ్ర చిన్ని, ఎంపీటీసీ మానుకొండ కన్నయ్య, మానుకొండ భీమయ్య, కేబీర్, మానుకొండ నాగేసు, ఉక్కుర్తి వెంకట్రావు, పెద్దిరెడ్డి జ్యోతిశ్రీనివాస్, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, సొసైటీ చైర్‌పర్సన్ గుర్రాల లక్ష్మణ్, మండల సచివాలయాల కన్వీనర్ డీజే రాజు, మానుకొండ సుబ్బారావు, వేల్పూరి కల్యాణ్, దాకారపు అగ్గియ్య, పసుపులేటి ఏసుబాబు, దాసరి ఏసురత్నం తదితరులున్నారు.

మహిళ మెడలో బంగారు తాడు చోరీకి యత్నం

కొవ్వూరు: భర్తతో కలిసి మోటారు సైకిల్‌పై వెళుతుండగా దొమ్మేరు శివారు గుర్తుతెలియని వ్యక్తులు వెనుక వైపు కూర్చున్న మహిళ మెడలో బంగారు గొలుసు చోరీకి ప్రయత్నించారు. దేవరపల్లికి చెందిన వేణుగోపాలరావు తన భార్యతో కలిసి మోటారు సైకిల్‌పై జాతీయ రహదారిపై వెళుతుండగా గురువారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. దుండగులు వెనుక నుంచి మహిళ మెడలో బంగారు తాడు లాగేందుకు యత్నించారు. ఈ క్రమంలో అదుపు తప్పి భార్యభర్తలు రోడ్డుపై పడిపోయారు. మహిళ సకాలంలో గుర్తించి బంగారు తాడుని గట్టిగా పట్టుకోవడంతో దొంగల ప్రయత్నం బెడిసి కొట్టింది. ఈ ఘటనలో కింద పడిన భార్యాభర్తలు ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి. హైవే పెట్రోలింగ్ పోలీసులు ఇరువురిని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వాహనంపై నుంచి పడిపోవడంతో కంగారులో దుండగులను గుర్తించలేకపోయామని వారు చెబుతున్నారు. ఈ ఘటనకి పాల్పడిన దుండగులను గుర్తించేందుకు పోలీసులు సీసీ టీవీ పుటేజీలను పరిశీలిస్తున్నారు.

పాఠశాలకు వెళ్లే దారేదీ?



నల్లజర్ల జెడ్పీ హైస్కూలుకు వెళ్లే దారికి అడ్డంగా బైక్‌లు, ఐస్‌క్రీం బళ్లు, ఇంకొక పక్క ఆర్టీసీ బస్సులు

నల్లజర్ల: మండల కేంద్రమైన నల్లజర్లలో జెడ్పీ హైస్కూలు బస్టాండ్ పక్కనే ఉంది. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల నుంచి వచ్చి దూరప్రాంతాలకు బస్సులలో వెళ్లేవారు తమ బైక్‌లను హడావిడిగా బస్టాండ్ పక్కనే ఉంచి వెళ్లిపోతున్నారు. వరుస క్రమంలో ఈ బైక్‌లన్నీ జెడ్పీహైస్కూలు ప్రధాన ద్వారం ఎదురుగా ఉంటున్నాయి. అదే సమయంలో మధ్యాహ్న భోజన వాహనం వస్తుంది. ఆ వాహనంలోకి పాఠశాలలోకి వెళ్లే మార్గం లేకుండా ఈ బైక్‌లు అడ్డుగా పెట్టడంతో సమస్య తలెత్తుతోందని, గేటు వద్ద హెచ్చరిక బోర్డు పెట్టినా ఎవరూ పట్టించుకోవడం లేదని పీడీ పీవీ అప్పారావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్కన మోటార్ సైకిళ్లు, ఐస్‌క్రీం బళ్లు, ఇంకొక పక్క బస్టాండ్‌కు వచ్చే బస్సులు నిలిచి ఉండటంతో పాఠశాల నుంచి బయటకు రావడానికి ఇబ్బందికరంగా ఉందని విద్యార్థులు తెలిపారు.

రాజ్యాంగంపై అవగాహన సదస్సు

దేవరపల్లి: భారత రాజ్యాంగంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని దేవరపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత సూచించారు. భారత రాజ్యాంగం-విద్యార్థులకు అవగాహన అనే అంశంపై గురువారం గౌరీపట్నంలో సదస్సు నిర్వహించారు. జెడ్పీటీసీ స్వర్ణలత ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జోతిరావ్ పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ రాయి అన్నపూర్ణ, వైస్ ఎంపీపీ కొర్లపాటి అరుణ, సొసైటీ అధ్యక్షుడు గుత్తికొండ అచ్యుతరావు, వైఎస్సార్ సీపీ నేతలు కుండా వెంకటేశ్వరరావు, టేకుమూడి సోమరాజు, కొటారు వెంకటసుబ్బారావు, ఆండ్రు శ్రీహరి, ఎం. పైడియ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

నిడదవోలు రూరల్: కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ డిమాండ్ చేశారు. నిడదవోలు బీసీ సామాజిక భవనంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా ప్రతినిధుల మహాసభను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ అధ్యక్షతన పలు అంశాలపై తీర్మానాలు ప్రవేశపెట్టారు. ఈకార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బి.వెంకట్రావు, సహాయ కార్యదర్శులుగా ఎండీవీ ప్రసాద్, ఈ.గ్రీస్మకుమార్, సీహెచ్.రమేష్, యర్రా శ్రీనివాస్, కోశాధికారిగా ఎం.నాగరాజు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వీఆర్వోపై చర్యలు తీసుకోవాలంటూ రైతు ఫిర్యాదు

ద్వారకాతిరుమల: భూ వివాదంపై స్పందనలో విచారణ జరుగుతుండగా ఆ భూమికి సంబంధించి ఆన్‌లైన్ రికార్డులో అక్రమంగా ఒక వ్యక్తిపేరును చేర్చిన వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ జి.సుందర్‌సింగ్‌కు బాధిత రైతు గురువారం ఫిర్యాదు చేశాడు. వివరాల ప్రకారం. తాడేపల్లిగూడెం మండలం తాళ్లముదునూరుపాడుకు చెందిన కళ్లేపల్లి వెంకటలింగంకు ద్వారకాతిరుమల మండలం నారాయణపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని ఆర్ఎస్ నంబర్ 603/1లో ఎకరం వ్యవసాయ భూమి ఉంది. సరిహద్దు రైతులైన లాయి నాగేశ్వరరావు, బండారు నాగులు తన భూమిని కాజేయాలనే ఉద్దేశ్యంతో ఎఫ్ ల్యాండ్, సర్వే రిపోర్టు, వీఆర్వో రిపోర్టులు లేకుండా సవరణ దస్తావేజులో హద్దులు, సర్వే నంబర్ మార్చి 2022లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, దీనిపై గతేడాది డిసెంబర్ 12న కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేసినట్టు రైతు వెంకటలింగం తహసీల్దార్‌కు అందించిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. స్పందన ఫిర్యాదుపై విచారణ జరుగుతుండగా సంబంధిత వీఆర్వో వివాదాస్పద భూమికి సంబంధించిన ఆన్‌లైన్ రికార్డులో లాయి నాగేశ్వరరావు పేరు ఎలా నమోదు చేశాడని బాధిత రైతు ప్రశ్నిస్తున్నాడు. తన స్వలాభం కోసం వీఆర్వో చేసిన పని వల్ల తీరని నష్టం జరుగుతోందన్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేయాలని రైతు వెంకటలింగం కోరుతున్నాడు.

వట్టి వసంత్ మృతి రాష్ట్రానికి తీరని లోటు



ఎంఎంపురంలో వసంతకుమార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల: ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ మృతి రాష్ట్రానికి తీరని లోటని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. భీమడోలు మండలం ఎంఎంపురంలోని ఆయన స్వగృహానికి గురువారం వెళ్లిన ఎమ్మెల్యే తలారి తదితరులు వసంతకుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ ద్వారకాతిరుమల మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, నల్లజర్ల, ద్వారకాతిరుమల సొసైటీల చైర్‌పర్సన్‌లు కారుమంచి రమేష్, గుర్రాల లక్ష్మణ్, బొండాడ వెంకన్నబాబు, నల్లూరి బాపనయ్య, నల్లూరి వెంకన్నబాబు, మండల సచివాలయాల కన్వీనర్ డీజే రాజు తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వసంత్ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వసంతకుమార్ తండ్రి వట్టి వెంకటరంగ పార్థసారథి, సోదరుడు వట్టి రమేష్, కుమారుడు పవన్‌ను వారు పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ రాజకీయాల్లో ప్రజలకు నిస్వార్థ సేవలందించి అందరి మన్ననలు పొందిన వ్యక్తి వసంతకుమార్ అని అన్నారు.